# కలికి కాలం

"మీ ఆవిడ పేరు చెప్పుబావా?" మరదలు అడిగింది హారతిపళ్లెం పట్టుకుని.

"మీ అక్కయ్య పేరు నీకు తెలియదా?" నవ్వుతూ అన్నాడు పెళ్లికొడుకు.

"మీ ఆయన పేరు నువ్వు చెప్పమ్మాయ్... బాగా ఎండెక్కిపోయింది. ఇప్పటికే భోజనానికి ఆలస్యమయ్యింది" అంది పెళ్లికొడుకు అక్కగారు తొందరపెడుతూ.

"నీకెప్పుడూ తిండి రంధే. మీ తమ్ముడిని ముందు అమ్మాయి పేరు చెప్పి లోపటికి అడుగెయ్యమను" అంది మరొకామె.

"నీ పేరడుగుతున్నారు" అన్నాడు పెళ్లికొడుకు పెళ్లికూతురి చిటికెను వేలు సుతారంగా గిల్లుతూ.

పెళ్లికూతురు మురిపెంగా నవ్వింది. ముగ్ధసింగారం మురిపెంగా నవ్వేసరికి పెళ్లికొడుకు నరాల్లో ఇంట్రావీనస్ మత్తు ఇంజెక్షన్ ఇచ్చినట్లయ్యింది.

"ఊరూ పేరు తెలుసుకోకుండానే అమెరికా నుంచి వచ్చి పల్లెటూరు అమ్మాయిని పెళ్లిచేసుకున్నాడు?" పెళ్ళికూతురు పక్షాన మాట్లాడింది ఒకామె.

గుమ్మానికి అడ్డంగా నిలబడ్డ ఆడవాళ్ళను నెట్టుకుని లోపలికి వెళ్ళే ప్రయత్నం చేయబోయారు నూతన వధూవరులు.

"ఈ పల్లెటూరి ఆచారాలు నాకు నచ్చవ్. వీళ్ళు లోపలికి వెళ్ళనివ్వకపోతే కారులో మా ఊరు వెళ్ళి పోదాం" అన్నాడు పెళ్ళికొడుకు పెళ్ళికూతురితో.

"తొందరపడకు పెళ్లికొడుకా అప్పగింతలయ్యేక సాయంత్రం మీ ఆవిడను తీసుకువెళ్దువుగాని. అమ్మాయ్ నువ్వన్నా చెప్పవే అబ్బాయి పేరు" ఆ ముచ్చటంతా సంబరంగా చూస్తున్న పెళ్లికొడుకు బంధువు ఒకాయన అందుకున్నాడు.

"ఆమని" అన్నాడు పెళ్లికొడుకు.

"అదేం పేరే" బుగ్గలు నొక్కుకుంది ఓ పండు ముత్తైదువ.

"అబ్బాయికి సుబ్బమ్మ పేరు నచ్చలేదట. ఆయని అని పేరు మార్చేసుకున్నాడు. శుభలేఖల్లో కూడా పెళ్లికూతురి పేరు ఆమని అని అచ్చు వేయించేడు" పక్కన వున్నావిడ వివరించింది.

"కలికాలం... పేర్లు మార్చుకోవడం మా కాలంలో లేవమ్మా" అంది ముసలావిడ.

భర్త పేరు చెప్పకుండానే లోపలికి అడుగువెయ్యబోయింది ఆమని.

"నా పేరు చెప్పకుండానే లోపలికి వెళ్ళిపోతున్నావే?" చెయ్యి పట్టుకుని పెళ్లికూతుర్ని వెనక్కు లాగేడు పెళ్లికొడుకు.

అందరూ ఘొల్లున నవ్వారు.

"భర్త పేరు నలుగురి ముందే చెప్పొచ్చా?" అంది ఆమని.

"మీ ఆయన ఇంట్లో లేనప్పుడు ఓటర్ల పేర్లు నమోదు చేసుకునే వాళ్ళో, రేషన్‌కార్డువాళ్ళో వస్తే నీ భర్త పేరు అడిగితే చెప్పవా?" రెట్టించింది పెళ్ళికొడకు అక్కగారు.

"పవన్‌కుమార్" అంది ఆమని మధురంగా.

పవన్‌కుమార్ ఛాతీ ఉప్పొంగింది ఆమని తియ్యటి కంఠం ద్వారా తన పేరు వినేసరికి.

అప్పగింతలయ్యేక మూడు నిద్రల కోసం అత్తగారింటికి వచ్చేసింది ఆమని.

పవన్ అక్కచెల్లెళ్ళు ఆమనిని ఆటపట్టిస్తూనే వున్నారు.

"మా అన్నయ్య నిన్ను ఇక్కడ వదిలేసి అమెరికా వెళ్ళిపోతాడట. నువ్వు ఊర్మిళా దేవిలాగా మా ఇంట్లో నిద్రపోతూ వుండాల్సిందే!"

"అందమైన భార్యను వదిలి దూరంగా పద్నాలుగు ఏళ్ళు లక్ష్మణుడు వుండగా లేంది, హాయిగా నిద్రపోవడానికి ఊర్మిళకు అంత కష్టం ఏం కాదులే!" అంది ఆమని.

ఆ మాట అయితే పైకి అందిగాని మనస్సులో భర్త తన వెంట తీసుకువెళ్ళడేమోనని ఆరాటపడింది.

ఆమనితో ఒంటరిగా కాలక్షేపం చేయడానికి పవన్‌కి వీలుచిక్కడంలేదు. ఆమె పక్కన ఎవరో ఒకరు వుంటూనే వున్నారు.

చుట్టాలందరూ వెళ్లిపోయాక ఆమనితో తీరిగ్గా కబుర్లు చెప్పడానికి వీలు చిక్కింది పవన్‌కు.

ముద్దమందారంలాంటి ఆమె రూపాన్ని తన కళ్ళలో దిగ్బంధం చేశాడు.

"ఉదయాన్నే నిన్ను ముద్దు పెట్టుకోవాలనే ఊహ మనస్సులో మెదిలేసరికి రాత్రంతా నిద్రపట్టలేదు" అన్నాడు పవన్ కాఫీ కప్పుతో ప్రత్యక్షమయిన ఆమనిని చూసి.

"ఇప్పుడు నిద్రపోండి" అంది ఆమని చిరునవ్వు చిందిస్తూ.

"తొలి సంధ్య వెలుగులో నారింజ రంగులో పగడాల వడగళ్ళు పడుతూ వుంటే నిద్ర ఎలా పడుతుంది?" కాఫీ కప్పు టీపాయ్‌మీద పెట్టి ఆమెను దగ్గరకు లాక్కున్నాడు.

"అమెరికా వెళ్ళి హాయిగా నిద్రపోతారు" మనస్సులో గుబులు బయట పెట్టిందామె.

"నువ్వు తోడు లేకుండా అమెరికా నేనొక్కడినే ఎలా వెళతాను? డిపెండెంట్ వీసా కోసం ప్రయత్నం చేస్తున్నాను. వచ్చే నెల మనం ఈ భూమికి రెండో వైపున వుంటాం" అన్నాడు ఆమె నడుం చుట్టూ చేతులు బిగించి.

మిసమిసలాడే ఆ పసిడిబొమ్మ అతని కౌగిలిలో ఒరిగిపోయింది. దొండపండువంటి ఆమె పెదాలు అతని సొంతమయ్యాయి.

"అమెరికాలో ఏం నేర్చుకున్నారు?" అందామె అతని జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ.

"కోపగించుకోవడం మానేసి ప్రశాంతంగా మాట్లాడటం నేర్చుకున్నాను" అన్నాడతను.

"ఏం నేర్చుకున్నారు?"

"ప్రశాంతంగా వుండటం" అన్నాడతను.

"అమెరికాలో ఏం నేర్చుకున్నారు?" మళ్ళీ అడిగిందామె.

"చెప్పానుగదా కోపగించుకోవడం మానేశానని". "ఏం నేర్చుకున్నానన్నారూ?"

"తలతిక్కగా వుందా... ఎన్నిసార్లు చెప్పాలి" అసహనంతో ఆమెకు కొంచెం దూరంగా జరిగి అన్నాడు.

ఫక్కున నవ్విందామె.

ఆమె ఎందుకు నవ్వుతోందో అర్థమైందతనికి. మళ్ళీ ఆమెకు దగ్గరగా జరిగేడు.

"సీతారాముల్లా మనం ఆదర్శదంపతులుగా వుండాలి" అందామె.

"సత్యాకృష్ణుల్లా ప్రేమ సముద్రంలో మునిగి తేలాలి... సీతారాములమయితే అన్నీ కష్టాలే! అరణ్యవాసం, ఎడబాటు, అగ్నిపరీక్షలు అన్నీ కష్టాలే!"

కలువరేకుల్లా వున్న ఆమె కళ్ళల్లోకి చూస్తూ వుండిపోయాడు. ఎంతసేపు చూసినా ఇంకా చూడాలనిపించే అంబర నీలిమ అతడ్ని వివశుడ్ని చేసింది.

"తలుపు గడియ పెట్టిరా" అన్నాడతను తమకంతో ఆమె చెక్కిళ్ళు ఎరుపెక్కాయి.

"ఇప్పుడు కాదు... ఇక్కడా కాదు... మా ఇంటి దగ్గర... ఆ తొలి రేయి మీ ఇష్టం' ' అందామె అతని చెంపలు నిమురుతూ.

"నాకు శోభన రాత్రి – అంటూ గదిలో పందిరిమంచం అలంకరణలు, పాల గ్లాసు ఇచ్చి గదిలోకి అమ్మలక్కలు తొయ్యడమూ, మనిద్దరం ఒకటవుతున్నామని అందరికీ చాటింపు వెయ్యడం నాకు నచ్చవ్ ! మీ ఇంట్లో చాటింపు వెయ్యడం నేను వొప్పుకోను... మీ ఊళ్లో జరిగినా, మా ఊళ్లో అయినా మన తొలి సమాగమం నేచురల్‌గా వుండాలి" అన్నాడు పవన్.

"మీ ఇష్టమే నా ఇష్టం కానీ పెద్దవాళ్ళు చెప్పినట్లు వినకపోతే బాధపడుతారు. వాళ్ళ మనస్సులు నొప్పించడం ఎందుకు?"

"ఐ డోంట్ కేర్" అన్నాడతను ఆవేశంగా. మౌనంగా కొన్ని క్షణాలు వుండిపోయింది.

ఆమని కళ్లల్లోని చల్లదనం అతని ఆవేశాన్ని పూర్తిగా తగ్గించి వేసింది.

"అయామ్ సారీ మై లవ్... బట్ అయామ్ ఫర్మ్ ఆన్ మై డెసిషన్... నీ ఇష్టం లేకుండా మాత్రం నీ పొందు ఆశించను."

హాలులో ఎవరో మాట్లాడుతున్నట్లు అలికిడవ్వడంతో అతని పెదాలపై తన పెదవులుంచి మృదువుగా స్పృశించి గదిలోనుంచి బయటకి వచ్చేసింది ఆమని.

అత్తగారింటికి వచ్చేడు పవన్.

వారం రోజుల నుంచి అతను ఆమనిని మచ్చిక చేసుకుని తన కౌగిలిలో కరిగిపోయేటట్లు చేయాలని ఎంతగానో ప్రయత్నించేడు.

ముద్దుల వరకు వచ్చి ఆగిపోతుందేగాని ముందుకు సాగడంలేదు ప్రేమ వ్యవహారం.

తల్లిదండ్రులు శోభనం ఏర్పాటుచేసేవరకు 'దూరం... దూరం' అంటూ వుంది ఆమని.

రెండక్షరాల 'ప్రేమ'కు రెండక్షరాల 'దూరం'కు మధ్య నలిగిపోతూ వున్నాడతను.

ఆ రోజు ఆమెను ఎలాగైనా లొంగదీసుకోవాలని నిశ్చయించుకున్నాడు.

భోజనాలయేళ్ళిక వెండి పళ్ళెంలో తమలపాకులు, వక్కపొడి, సెంటెడ్ సున్నం డబ్బా పెట్టుకుని గదిలోకి వచ్చింది.

తల నిండా కనకాంబరాలు పెట్టుకుని ఎర్ర చీర కట్టుకుని వసంతశోభను వెంటబెట్టుకుని వచ్చినట్లుగా వుందామె.

అరటి తోట నడుం చుట్టూ మలుపుతిరిగిన పంటకాలువలా, రంగు రంగుల పూలచీర ధరించిన ధరిత్రిలా కన్పించిందామె.

అతనిలో ఉద్రేకం కట్టలు తెంచుకుంది.

ఆమెను పొదవి పట్టుకున్నాడు. సిగ్గుతో మెలికలు తిరిగింది ఆమని.

"పున్నములు వున్నంతకాలం, ఏరువాక సాగినంత కాలం మన ప్రేమ కొనసాగుతుందికదూ" అన్నాడ తను ఆమెను కబుర్లలోకి దించుతూ.

అతని ఎత్తుగడ తెలుసుకుని నవ్వుకుందామె. "శోభనం రోజు వరకూ తొందరపడొద్దంది మా అమ్మ" అంది మెల్లగా.

గులాబీల సోయగం చూసి మురిసిపోతున్నవాడికి గులాబీ ముల్లు గుచ్చుకున్నట్లుగా వుందతని పరిస్థితి.

"నాకేం లేదు తొందర"

వెయ్యి వోల్టుల బల్బు కాంతి జీరో వోల్టు బల్బు కాంతిలోకి మారినట్లు అతని మొహం చిన్నబోయింది.

పవన్ బావమరిది కిషోర్ గదిలోకి రావడంతో వాతావరణమే మారిపోయింది. ఎయిర్ కండిషన్డ్ గదికి కరెంటు ఆఫ్ అయినట్లయ్యింది.

"బావా పదిహేడు తొమ్మిదులెంత?" కిషోర్ అడిగేడు.

'ఏడ్చినంత' అనుకున్నాడు మనస్సులో.

"ఎక్కాల పుస్తకంలో చూడు" అన్నాడు పవన్ మటమటలాడుతూ.

"అమెరికా వెళ్ళావ్... ఆ మాత్రం చెప్పలేవా?" గదిలో నుంచి బయటకు తుర్రుమన్నాడు కిషోర్. ఆమని పగలబడి నవ్వింది.

"మన కష్టాలు గెట్టక్కాయి. మా నాన్న గర్భాదానం ముహూర్తం పెట్టించుకువచ్చాడు... రేపంతా మంచిదే నట...సాయంత్రం నాలుగ్గంటలకు దివ్యంగా వుందట... మీకు శోభన రాత్రి ముచ్చట్లు, ఆచారాలు ఇష్టంలేదని చెప్పారుగా. ఆ ఏర్పాటులేవీ మావాళ్ళు చెయ్యడంలేదు... రేపు మాత్రం మనిష్టం... మీరు ఎలా చెబితే అలా నడుచుకుంటాను రేపటి నుంచి" అందామె అతని ఛాతీపైన వాలిపోతూ.

పవన్‌కు కోసం వచ్చింది.

"మీరేనా నిర్ణయాలు తీసుకునేది... నాకూ వున్నాయి ఆలోచనలు...ఎటువంటి పరిస్థితిలోనూ రేపు నీ వొంటి మీద చెయ్యి వెయ్యను...ఇది నా ఛాలెంజ్' అన్నాడు పవన్ పట్టుదలగా.

ఆమనిని ఆలోచనలు ముట్టడిచేశాయి.

ఆ కలికి మనస్సు కల్లోల కడలి అయ్యింది.

మరుసటి రోజు ఆమని చక్కగా ముస్తాబయ్యింది. పవన్ మాత్రం ముభావంగా వుండిపోయాడు. సాయంత్రం మూడు గంటలయ్యింది.

"మామిడి తోటలో సరదాగా తిరిగొద్దామా?" పవన్‌ని అడిగింది ఆమని.

సరేనని తలూపేడు. మామిడి తోటలో చిన్నపిల్లలా ఆమని గంతులేస్తుంటే పవన్ మనస్సు మెత్తబడింది. తన ప్రతిజ్ఞ గుర్తుకువచ్చినప్పుడల్లా ఆమెకు దూరంగా జరిగేవాడు.

మోటబావి దగ్గర కూర్చున్నారిద్దరూ.

"మీ మనస్సుకు బాధ కలిగించే ఓ విషయం ఇన్నాళ్ళూ మీకు చెప్పకుండా దాచేను... నన్ను క్షమించండీ!" అంది ఆమని గొంతు తగ్గించి.

"ఏమిటిది?"

"నన్ను మన్నిస్తానంటేనే చెబుతాను"

"ఇంతకు మునుపు ఎవరినన్నా ప్రేమించావా?" కాదన్నట్లుగా అడ్డంగా తలూపింది.

"ఎవరన్నా నిన్ను రేప్ చేశారా?"

"ఛీ.. పాడు ఏం మాటలవి"

"అయితే మరేమిటో చెప్పు"

"నాకు ఆరేళ్ళ వయస్సుప్పుడు దీపావళి రోజు చిచ్చుబుడ్డి పేలడంతో మోకాళ్ళపైన గాయాలయ్యాయి. ఆ మచ్చలు ఘోరంగా ఇప్పటికీ వున్నాయి. మీరు చూస్తే అసహ్యించుకుంటారు" అందామె.

అతని గుండె వేగంగా కొట్టుకుంది.

"ఏవీ చూపించు" అన్నాడతను ఆత్రుతతో.

"ఇక్కడా... ఆ కనబడే పశువుల సావిడి దగ్గరకు వెళ్దాం పదండీ".

పశువుల సావిడి ఖాళీగా వుంది. పశువుల్ని పొలానికి తోలుకువెళ్లినట్లున్నాడు పాలేరు.

ఎండుగడ్డి మోపుపై కూర్చుంది ఆమని.

చీర కాళ్లపైనుండి తొలగించడానికి సిగ్గుపడింది. అతనే చీర తొలగించేడు.

పచ్చగా మెరుస్తూ కన్పించేయి ఆమె పిక్కలు, ఆపైన మోకాళ్ళూ...

ఎక్కడా కందిగింజంత మచ్చ కూడా లేదు.

ఉద్రేకంతో ఊగిపోయాడతను. ఆమెపై వాలిపోయాడు.

ఆమె శరీరంపై నుండి వస్తున్న చిరుగంధపు వాసన అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది.

ఆమె నునుపైన ఎదపై తమకంగా కదిలేయి అతని చేతివేళ్ళు. అతన్ని చుట్టుకుపోయింది ఆమె.

ఆ అనుభవం క్షణికం... కానీ ఆ అనుభూతి శాశ్వతం...

కొన్ని నిముసాలు గడిచేక సర్దుకు కూర్చున్నారు. "ఇప్పుడు టైం ఎంత అయ్యింది?" అడిగిందామె. "నాలుగు గంటల అయిదు నిముషాలు" అన్నాడతను.

ఫక్కున నవ్విందామె.

"మా నాన్న చెప్పిన ముహూర్తానికే నాలో ఐక్యం అయిపోయారు. మచ్చలు కన్పించేయా?" అతనికి చిక్కకుండా అక్కడినుండి పరుగెత్తిందామె. *

**(స్వాతి - 2-7-1993)**